స్వరాష్ట్రంలో ఆలయాలు ఆధ్యాత్మిక వైభవాన్ని సంతరించుకున్నాయి. సమైక్య రాష్ట్రంలో అభివృద్ధి, ధూపదీప నైవేద్యాలకు సైతం నోచుకోని మానకొండూర్ నియోజకవర్గంలోని అనేక పురాతన క్షేత్రాలు, ఆలయాలు నేడు నిత్య పూజాది కాలతో కళకళలాడుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వడం.. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ప్రత్యేక చొరవతో నిధులు మంజూరు చేయించి సౌకర్యాలు మెరుగుపరుచడంపై భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. **తిమ్మాపూర్, నవంబర్ 9**



శంకరపట్నం మండలం కొత్తగట్టులోని మత్స్య గిరీంద్రస్వామి ఆలయం

# ఆలయాలకు ఆధ్యాత్మిక వైభవం



తిమ్మాపూర్ మండలం మహాత్మా నగర్ లోని
శ్రీ తాపాల లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అనుబంధ కల్యాణ మండపం

- స్వరాష్ట్రంలో పురాతన క్షేత్రాలకు కొత్త సొబగులు
- మానకొండూర్ నియోజకవర్గంలో రూ.పదుల కోట్లతో పునరుద్ధరణ పనులు
- ప్రభుత్వ సహకారంపై భక్తుల్లో హర్షాతిరేకాలు

మానకొండూర్ నియోజకవర్గంలోని మానకొండూర్, శంకరపట్నం, తిమ్మాపూర్, గన్నేరువరం, బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలు.. ఆలయాలు, మందిరాలకు పెట్టింది పేరు. ఆయా మండలాల్లో అద్భుతమైన క్షేత్రాలు ఉన్నాయి. కాలక్రమంలో దెబ్బతిన్న పలు ఆలయాలను పునరుద్ధరించడంతో పాటు పలు చోట్ల భక్తులకు సౌకర్యాలను మెరుగుపరిచారు.

### విరివిగా నిధులు.. సమకూరిన సౌకర్యాలు

తెలంగాణ ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి రెండు పర్యాయాల్లో రూ. కోట్ల నిధులను మంజూరు చేసింది. శంకరపట్నం మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్ర స్వామి ఆలయ ఆవరణలో కల్యాణమండపం, గాలిగోపురం, సీసీ రోడ్డును రూ.కోటికి పైగా నిధులతో అద్భుతంగా నిర్మించారు. అలాగే ఆలయ చైర్మన్ మల్హాల్ రావు ఆధ్వర్యంలో దాతల సాయంతో రూ.25 లక్షలతో స్వామివారి భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. కేశవపట్నంలోని వేణుగోపాలస్వామి ఆలయ పునరుద్ధరణకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. గన్నేరువరం మండలంలోని ఖాసీంపేట



కొత్తగట్టు గుట్టపై దాతలతో సహకారంతో నిర్మించిన మత్స్య గిరీంద్రస్వామి విగ్రహం

గ్రామంలో మానసాదేవి ఆలయ అభివృద్ధికి రూ.12 లక్షలు, పారువెల్లలోని శ్రీ లక్ష్మీగణపతి స్వామి వారి ఆలయానికి సైతం నిధులు మంజూరు చేశారు. తిమ్మాపూర్ మండలం నల్లగొండ లక్ష్మీనరసింహస్వామి వారికి రూ.50 లక్షల నిధులతో నూతన ఆలయం, మహాత్మానగర్‌లోని శ్రీ తాపాల లక్ష్మీనరింహస్వామి ఆలయానికి రూ.50 లక్షల నిధులతో కల్యాణమండపం నిర్మించారు. బెజ్జంకి మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని రూ. కోటిన్నర నిధులతో అభివృద్ధి చేశారు. అంతేగాక పలు గ్రామాల్లో వివిధ ఆలయాలను నిధులు మంజూరు చేసి భక్తులకు అవసరమైన సౌకర్యాలు సమకూర్చారు. మానకొండూర్ మండలంలోని ముంజంపల్లి గ్రామంలో ఎల్లమ్మగుడి, పోచమ్మ, మడేలయ్యేశ్వరస్వామి ఆలయాలకు రూ.20లక్షలు, అన్నారం నృసింహ స్వామి ఆలయానికి రూ.34లక్షలు, కొండపల్కలలోని పలు ఆలయాలకు రూ.20లక్షలు, గంగిపెల్లిలో రూ.60లక్షలు, గట్టుదుద్దెనపల్లి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ అభివృద్ధికి రూ.20లక్షలు మంజూరు చేశారు.

### ప్రార్థనా మందిరాలకు సైతం..

నియోజకవర్గ వ్యాప్తంగా ఆలయాలతో పాటు ప్రార్థన మందిరాలు, చర్చిలకు సైతం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి సౌకర్యాలు కల్పించింది. ప్రార్థన మందిరాలకు గతంలో వారి సంస్థల నుంచి మాత్రమే నిధులు వచ్చేవి. కానీ తెలంగాణ ప్రభుత్వం ప్రార్థన మందిరాల అభివృద్ధికి సైతం తోడ్పాటునందించి అన్ని మతాల పట్ల సమదృష్టిని చాటింది.

## కొండగట్టులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

మానకొండూర్, నవంబర్ 9: మానకొండూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కుటుంబ సభ్యులతో కలిసి కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. గురువారం నామినేషన్ దాఖలు చేయనున్న సందర్భంగా ఉదయం స్వామివారిని దర్శించుకుని ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయానికి చేరుకున్న రసమయి బాలకిషన్‌కు ఆలయ వేదపండితులు ఘన స్వాగతం పలికారు. స్వామివారి సన్నిధిలో పూజలు చేయించిన నామినేషన్ పత్రాలను వేదపండితులు రసమయి బాలకిషన్‌కు అందించి, మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచి హ్యాట్రిక్ సాధిస్తావని ఆశీర్వదించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, నాయకులు దేవ సతీశ్‌రెడ్డి, ముద్దసాని శ్రీధర్‌రెడ్డి, పడాల సతీశ్‌గౌడ్, అభిలాష్ తదితరులు పాల్గొన్నారు.

## కేతిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తిమ్మాపూర్, నవంబర్ 9: బీఆర్ఎస్ నాయకుడు కేతిరెడ్డి దేవేందర్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పార్టీ జిల్లా, మండల నాయకులు, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. గురువారం మండల కేంద్రంలో జరిగిన జన్మదిన వేడుకల్లో అభిమానులు ఆయనతో కేకు కోయించారు. స్వీట్లు తినిపించారు. మండల ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, ముఖ్య నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రావుల రమేశ్, నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్‌రావు, కొత్త తిరుపతిరెడ్డి, లక్ష్మణ్, దళిత సంఘాల నాయకులు, కులసంఘాల నాయకులు, మహిళా సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



మొలంగూర్ స్కూల్‌లో ప్రింటర్ కొనుగోలుకు హెచ్ఎం నీరజకు విరాళం అందజేస్తున్న పీఈటీ జ్యోతి

## దాతల ఔదార్యం

శంకరపట్నం, నవంబర్ 9: మండలంలోని మొలంగూర్ జడ్పీ ఉన్నత పాఠశాల కోసం ప్రింటర్ కొనుగోలుకు ఆ స్కూల్ పీఈటీ బీ జ్యోతి విరాళం అందజేశారు. స్కూల్‌కు అవసరమైన ప్రింటర్ కొనుగోలుకు ఉపాధ్యాయులు నిర్ణయం తీసుకోగా దాతల సహాయం కోరారు. ఇందులో భాగంగా బుధవారం అదే గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బూర్ల రఘుపతి రూ. 5వేలు విరాళం ఇవ్వగా, గురువారం అదే పాఠశాలలో పని చేస్తున్న పీఈటీ బీ జ్యోతి తన వంతుగా రూ. 10 వేలు అందజేశారు. మరో రూ.5 వేలు ఇతరులు విరాళం అందజేశారని, మొత్తం రూ. 20 వేలతో నూతన ప్రింటర్‌ను కొనుగోలు చేస్తున్నట్లు హెచ్ఎం నీరజ వెల్లడించారు. దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

## బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి

- రసమయి బాలకిషన్‌ను మూడోసారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలి
- ఇంటింటా ప్రచారంలో గులాబీ శ్రేణులు



ఇల్లంతకుంట: మండల కేంద్రంలో కరపత్రాలు పంచుతూ కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఇల్లంతకుంట, నవంబర్ 9: తెలంగాణలో బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఏఎంసీ చైర్మన్ మామిడి సంజీవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రంలో మానకొండూర్ బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని బీఆర్ఎస్ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవ్ మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే అభివృద్ధి జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం చీకటి మయమవుతుందని ప్రజలు గుర్తించాలన్నారు. అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని, రసమయి బాలకిషన్‌ను మూడో సారి ఎమ్మెల్యేగా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ కూనబోయిన భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ ఒగ్గు నర్సయ్య, ఉపసర్పంచ్ సాదుల్, నాయకులు కూనబోయిన బాలరాజు, ఉస్మాన్, భాస్కర్, రాములు, శ్రీనివాస్, తిరుపతి పాల్గొన్నారు.



గన్నేరువరం: గుండ్లపల్లిలో కరపత్రాలు పంచుతూ ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు

### గన్నేరువరంలో..

గన్నేరువరం, నవంబర్ 9: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే రసమయి తరఫున ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, కారు గుర్తుకు ఓటు వేసి, రసమయి బాలకిషన్‌ను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ లింగాల మహేందర్ రెడ్డి, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్, యూత్ మండలాధ్యక్షుడు కుమార్, టేకు అనిల్, అజయ్, సుమన్, నాగరాజు, ప్రశాంత్, సాయితేజ, అంజి, తిరుపతి, శ్రీను పాల్గొన్నారు.



శంకరపట్నం: తాడికల్‌లో డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గంట మహిపాల్, తదితరులు

### శంకరపట్నంలో..

శంకరపట్నం, నవంబర్ 9: బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని పార్టీ మండలాధ్యక్షుడు గంట మహిపాల్ అన్నారు. గురువారం మండలంలో తాడికల్, ముత్తారం, ధర్మారం, ఆముదాలపల్లి, తదితర గ్రామాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్‌కు మద్దతుగా నాయకులు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తాడికల్‌లో గంట మహిపాల్ మాట్లాడుతూ, పిలిస్తే పలికే ఎమ్మెల్యేగా పేరున్న రసమయి ప్రజలకు కష్ట సుఖాల్లో వెన్నంటి నిలిచారని తెలిపారు. ప్రజలు తమ ఓటును కారు గుర్తుకు వేసి డాక్టర్ రసమయి బాలకిషన్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, సర్పంచ్ చుక్కల రవి, బీఆర్ఎస్ నాయకులు బుద్దార్థి సంపత్, పంజాల రాజయ్య, చిమిరాల శేషాచారి, మొలుగూరి శ్రీనివాస్, వీరస్వామి, సత్యం, రమేశ్, నాగయ్య, రమేశ్ పాల్గొన్నారు.